సాక్షి తిరుపతి

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



చిత్తూరు రౌడీల అరాచకం

తిరుపతిలో చిత్తూరు గూండాలు, అల్లరి మూకలు అరాచకం సృష్టిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే భూమన మండిపడ్డారు. - 8లో



పోస్టల్ బ్యాలెట్‌ను..

పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. - 8లో



ఉపాధి కూలీ మృతి

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన వరదయ్యపాళెం మండలంలో చోటు చేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

నేడు వెంకటగిరికి సీఎం జగన్

– ఏర్పాట్లను పరిశీలించిన నేతలు



పోలీసులు, ఉన్నతాధికారులతో చర్చిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో విడత సిద్ధం సభలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం 1.15 నిమిషాలకు వెంకటగిరికి విచ్చేయనున్నారు. ఈ మేరకు నేతలు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగి, అక్కడి నుంచి బస్సుయాత్రలో భాగంగా త్రిభువని సెంటర్ వద్దకు చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సుమారు గంట పాటు ఈ ప్రసంగం సాగనుంది. అనంతరం 2.40కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని కుందుకూరులో జరిగే సభకు బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా శనివారం వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు ఎమ్మార్సీరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనంజయ్యరెడ్డి, వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమార యాచేంద్ర, బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, సుళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, స్థానిక నేతలు జీ.ఢిల్లీబాబు, నక్కా వెంకటేశ్వరరావు, చిట్టేటి హరికృష్ణ, బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

ప్రశాంతంగా పాలిసెట్

- జిల్లాలో 86.53 శాతం మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి విద్యార్హతతో పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష శనివారం తిరుపతి, గూడూరులోని 14 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు తిరుపతి జిల్లా నుంచి మొత్తం 5,126 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం తిరుపతిలో 8, గూడూరులో 6, మొత్తం 14పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు తిరుపతిలో 3,976 మంది, గూడూరులో 1,150 మంది, మొత్తం 5,126మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే ఇందులో మొత్తం 690మంది గైర్హాజరవ్వడంతో 4,436 (86.53శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులను ఆయా పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 10 గంటల నుంచే అనుమతించారు. సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ ఏ.నిర్మల్‌కుమార్‌ప్రియ, పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ ఆర్ వీ.రమణ, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్‌వీ.గౌరీశంకర్ పర్యవేక్షణలో పాలిసెట్ ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు.

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం చంద్రబాబు లాగా అలవిగాని హామీలిచ్చి చివరకు చేతులు పైకెత్తే రకం కాదని గుర్తుచేసుకుంటున్నారు. జగన్ మాటంటే.. మాటేనని.. ఆయన చెప్పాడంటే.. చేస్తాడంతేనని ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. చేయగలిగినవే చేబుతాడని.. చెప్పినవే తూచాతప్పక పాటిస్తాడని సంబరపడుతున్నారు. సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యంగా మేనిఫెస్టో రూపకల్పన చేశారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది పేదల మేనిఫెస్టో అని.. వారి తలసరి ఆదాయం పెంచడమే ధ్యేయంగా సంక్షేమ మొత్తాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారని, ఈ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేస్తారనే నమ్మకం ఉందని చెబుతున్నారు. జగన్ అంటే నమ్మకానికి ప్రతిరూపమని, ఆయన వెంటే ఉంటామని ప్రతినబూనుతున్నారు. శనివారం విడుదలైన వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చెప్పాడంటే..చేస్తాడంతే!

ప్రజారంజకంగా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో

- తిరుపతిలో స్కిల్ వర్సిటీ నిరుద్యోగులకు వరం
- ప్రజల జీవన ప్రమాణ స్థాయి పెంచడమే లక్ష్యం
- ఉద్యోగులకు సముచిత స్థానం
- మహిళాసాధికారితే ధ్యేయం
- రైతు సంక్షేమం, బడుగు, బలహీన వర్గాలకు ప్రోత్సాహం
- సీఎం జగన్ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

జగన్ మేనిఫెస్టోను నమ్మొచ్చు



గత ప్రభుత్వాలు ప్రజలకు అమలు చేయలేని హామీలను గుప్పించే వారు. ఏ ప్రభుత్వమైతే సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుందో అప్పుడే ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్ తన మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇది పేదల జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు ఉపయోగపడుతుంది. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, చేదోడు, రైతు భరోసా వంటి పథకాలకు ఇచ్చే నగదును పెంచడం సంతోషకరం. దీంతో రైతులు, మహిళలు తమ ఆర్థిక స్థితిగతులను కొంతమేర మెరుగు పరచుకునేందుకు వీలుంటుంది. ఇది ప్రతి నిపుణులు ఆహ్వానించదగ్గ మేనిఫెస్టో. –నవరయ్య, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఎస్వీయూ, తిరుపతి

జీవన ప్రమాణ స్థాయి పెరుగుతుంది



సంక్షేమం.. అభివృద్ధి అంటే గతంలో చంద్రబాబు నాయుడు చేసిన విధంగా భవనాలు నిర్మించడం, త్రీడీ చిత్రాలను సృష్టించి సింగపూర్, అమెరికా అంటూ ప్రజలను వంచించడం కాదు. మహిళలు, బడుగు బలహీన వర్గాలు, రైతులను సంక్షమం వైపు నడిపించాలి. వారి ఆర్థిక స్థితిగతులను పెంచేలా ప్రభుత్వాలు సహాయసహకారాలు అందించాలి. అప్పుడే వారి జీవన ప్రమాణ స్థాయి పెరుగుతుంది. సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తే ప్రజల జీవన ప్రమాణ స్థాయి పెంచేలా ఉంది. గతంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వ్యక్తిగా చేసేదే చెబుతా అంటూ ప్రజల ముందుకు వచ్చి ధైర్యంగా చెప్పడం నమ్మదగిన విషయం. ఇచ్చిన ప్రతి హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చినప్పుడే మేనిఫెస్టో పవిత్ర గ్రంథమవుతుంది. –ప్రొఫెసర్ బీ.సుగుణరెడ్డి, మాజీ రిజిస్ట్రార్, మహిళా వర్సిటీ

బాబు నిరుద్యోగులను నట్టేటముంచారు



గతంలో చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిరుద్యోగులను నట్టేటముంచారు. నిరుద్యోగుల పేరుతో సుమారు వంద కోట్లు స్కామ్ చేసి అడ్డంగా దొరికిపోయారు. ఒక్కటంటే ఒక్క ఉద్యోగం రాలేదు. సీఎం జగన్ నిరుద్యోగ యువతకు స్కిల్ వర్సిటీ నెలకొల్పుతామని హామీ ఇవ్వడం ఓ వరం లాంటింది. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్‌లు, జిల్లాకో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. ఐటీఐ, డిప్లొమో, పాలిటెక్నిక్, బీటెక్ వంటి టెక్నికల్ కోర్సులు చదివిన విద్యార్థులకు నైపుణ్య శిక్షణకు పెద్దపీట వేసి ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా వర్సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పడం ఆహ్వానించదగ్గ విషయం. 175 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లు, 26 జిల్లాలో స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామనం చెప్పడం ఇదో విప్లవాత్మక నిర్ణయం. కళాశాలలో శిక్షణ పొందుతున్న పురుష విద్యార్థులకు రూ.2,500, మహిళా విద్యార్థినులకు రూ.3వేలు స్టైఫండ్ ఇవ్వడమనేది శుభపరిణామం. దీంతో నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. దేశంలో ఇలాంటి అవకాశాలు ఏ రాష్ట్రంలోనూ లేవు.

–ప్రొఫెసర్ వీ.నారాయణరెడ్డి, రిటైర్డ్ రిజిస్ట్రార్, తిరుపతి

బాబు మాటల గారడి



చంద్రబాబు మేనిఫెస్టో మాటల గారడి. ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చిన దాఖలాలు లేవు. రుణ మాఫీ అని మహిళలను మోసం చేశారు. జగనన్న వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రస్తుతం రూ1.50 వేలకు పెంచి డబుల్ చేస్తామని జగనన్న హామీ ఇచ్చారు. అమ్మ ఒడి రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచడం, సున్నా వడ్డీ రుణాలు రూ.3లక్షలు, ఈబీసీ నేస్తం రూ.45 వేల నుంచి రూ.1.05వేలకు, చేదోడును రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచడం సంతోషంగా ఉంది. ప్రతి మహిళాకు ఇది శుభవార్తే.

– పీ.గౌరి, ధోబీగాట్, తిరుపతి

పింఛన్ రూ.3,500 పెంచడం ఆనందం



పేద ప్రజలకు, వితంతువులకు, వయో వృద్ధులకు ఈ వార్త ఆనందం కలిగిస్తుంది. రూ.3వేల నుంచి 3,500కు పింఛన్ పెంచడం సంతోషం. చంద్రబాబు గతంలో పింఛన్ రూ.1000 మాత్రమే ఇచ్చేవారు. దాని కోసం నరకయాతన అనుభవించే వారు. గత ఐదేళ్లుగా 3వేలు పింఛన్ ఇంటి వద్దకే అందిస్తున్నారు. ఇది ఎంతో ఊరటనిచ్చే అంశం. మహిళలకు సంఘంలో రూ.3లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తానని చెప్పడం ఆనందంగా ఉంది. –సరోజమ్మ, కేటీ రోడ్డు, తిరుపతి

మేనిఫెస్టో జగన్‌కు పవిత్ర గ్రంథం



చంద్రబాబు నాయుడు గతంలో మూడు మార్లు ప్రజలను మోసం చేశారు. అలవిగాని హామీలతో ఆయన అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించారు. అడిగిన వారిని జైల్‌లో పెట్టించారు. వ్యవసాయం దండగన్న చంద్రబాబును రైతులు విశ్వసించరు. ఐదేళ్లలో వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించి రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 ఇచ్చి ఆదుకున్నారు. అదే రీతిలో రానున్న మరో ఐదేళ్ల పాటు ఆ మొత్తాన్ని రూ.16 వేలకు పెంచుతూ సీఎం జగన్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. రైతు సంతోషం కోరిన ప్రభుత్వమే ఎక్కువకాలం మన్నగలదని నా నమ్మకం. – ఆర్.యశోద, ఎర్రమిట్ట, తిరుపతి

చదువుల భారం తగ్గింది



సీఎం జగనన్న పాలనలో చదువుల భారం మరింత తగ్గుతోంది. పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుకునే అవకాశం కలిగింది. మరమ్మగ్గ కార్మికులుగా దినసరి కూలీతో జీవనం సాగించే మాలాంటి వారి పిల్లలు భారం లేకుండా కార్పొరేట్ స్థాయి చదువులు చదువుకుంటున్నారు. ఐదేళ్ల క్రితం వరకు ఇంగ్లిష్ మీడియం చదివించాలంటే ప్రైవేట్ స్కూళ్లకు పంపాలి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా కలలు నెరవేరాయి. జగనన్న తిరిగి రాష్ట్రానికి సీఎంగా రావాలని కోరుకుంటున్నా.

– సెల్వీ, సెంగుందర్ వీధి, నారాయణవనం

బాబువి మాయ మాటలే



రైతు రుణ మాఫీ చేస్తామని, మహిళలకు బంగారు రుణాలు తీర్చేస్తామని మాయ మాటలతో 2014లో అధికారం చేపట్టి చంద్రబాబు వారిని నట్టేటముంచారు. ప్రభుత్వ ఉద్యోగులను పూర్తిగా విస్మరించారు. జగన్ ఐదేళ్ల పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు. ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులకు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైద్యం, ఇంటి నిర్మాణానికి సాయం అందించేలా వారికి సైతం నవరత్నాలను అందించే విధంగా సీఎం జగన్ మేనిఫెస్టోలో పెట్టారు. గతం ఏ ప్రభుత్వాలు ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. నెరవేర్చే హామీలనే జగన్ ప్రజలకు ఇచ్చాడు.

– వీ.రామక్రిష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

చెప్పింది చేస్తాడు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా ఉంది. చేసేదే చెప్తాను.. చెప్పింది చేస్తాను అన్న సీఎం వైఎస్ జగన్ అదే తరహాలో తన 2024 ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారు. నవరత్నాల పథకాల కొనసాగింపుతో పాటు ఈ సారి నూతనంగా అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, నాడు–నేడు ద్వారా మరింత లబ్ధి చేకూరేలా మేనిఫెస్టో ఉంది. ఎన్నికల్లో ఆయన చరిత్ర సృష్టించడం ఖాయం.

– బోడిరెడ్డి నరసింహారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, చంద్రగిరి

నువ్వు సూపర్ అన్నా



ఆయన చెప్పాడంటే చేస్తాడు. చేయగల్గిన హామీలనే చెప్తాడు.. ఆయనపై ఆ నమ్మకం మాకు ఉంది. 2024 ఎన్నికలకు సంబంధించి విడుదల చేసిన జగనన్న నూతన మేనిఫెస్టో పేద ప్రజల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. అందులో రైతన్నకుల ఇచ్చే రైతు భరోసా సొమ్మును రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంచి ఇవ్వడం చాలా సంతోషం. అలాగే రైతులకు ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, దేశంలో ఎక్కడాలేని విధంగా కౌలు, దేవాలయ, అటవీ భూములకు కూడా రైతు భరోసా ఇవ్వడం సంతోషకరం.

– కోట్లపూడి శ్రీనివాసులు, రైతు, కాశీపురం, వాకాడు మండలం

జగన్ నమ్మకానికి ప్రతిరూపం



మాట ఇచ్చి తప్పని వ్యక్తి సీఎం జగన్. ఆయన నమ్మకానికి ప్రతి రూపం. ఇప్పుడు ఎన్నికల సమయంలో కూడా అవ్వాతాతలకు అండగా నిలవడంతో పాటుగా రైతులకు, తల్లులకు, చిరు వ్యాపారస్తులకు మేలు చేకూర్చేవిధంగా మేనిఫెస్టోను రూపొందించారు. చేయగలిగినవే చెప్పే మొనగాడు జగన్.

– ఎన్.శ్రీనివాసులు, పాల ఏజెన్సీ డీలర్, వంజివాక, కోట మండలం

జగన్ మాటంటే మాటే



78 ఏళ్ల వయసులో ఎవరూ లేని నాకు అంతా తానై వైఎస్సార్ పెన్షన్ కానుకను ఇస్తున్నారు. నా భర్త రామస్వామి మృతి చెందడంతో ఒంటరిగా ఉన్న నాకు వలంటీర్ చొరవతో పెన్షన్ మంజూరైంది. నాలాంటి వృద్ధులకు అంతా తానై జగనన్న అందిస్తున్న వైఎస్సార్ పెన్షన్‌ను వెయ్యి నుంచి పెంచుతూ రూ.3వేలకు చేర్చారు.ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే రూ.3,500కు ఇస్తానని చెబుతున్నారు. చాలా సంతోషంగా ఉంది. ఆయన మాటిస్తే చేస్తాడంతే. – అలిమేలు, ఏకాంబర కోటవీధి నారాయణవనం

రైతుకు భరోసా



రైతుల జీవితాల్లో వెలుగు నింపారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో లేనిపోని మాయ మాటలు చెప్పి అధికారం కోసం చంద్రబాబు తహతహలాడుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాయమాటలకు తావివ్వకుండా నిజాయితీగా వ్యవహరించి మేనిఫెస్టోను విడుదల చేశారు. రైతుకు మరింత భరోసా కల్పించారు. చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి ముంచేశారు. ఆయన మాటలు నమ్మలేం. – గద్దం బాలకృష్ణారెడ్డి, సైదాప్‌పల్లి గ్రామం, రాపూరు మండలం

రైతుకు వెన్నుదన్ను



జగన్‌మోహన్‌రెడ్డి చెప్పేది చేస్తాడు. చేయలేనిది ఏదీ చెప్పడు. అందే ఆయన నైజం. అందుకే ఎన్నికల మేనిఫెస్టోలో రైతుల కోసం రూ.16 వేలకు పెంచాడు. గతంలో కూడా రైతు భరోసా కింద ప్రతి ఏడాదీ రూ.13,500 క్రమం తప్పక అందజేసి రైతుకు అండగా నిలిచాడు.

– సైదాదుపల్లి శంకరయ్య, పురిటిపాళెం, గూడూరు మండలం

తిరుపతి నగరంలో అలజడి నెలకొంది. ప్రశాంతంగా ప్రసారం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులపై చిత్తూరు రౌడీ మూకలు దాడికి తెగబడ్డాయి. దుర్భాషలాడుతూ, మహిళలనీ చూడకుండా వారిని పక్కకు నెడుతూ.. దాడికి దిగడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. ఇంతజరుగుతున్నా సంబంధిత కూటమి అభ్యర్థి వారికి సర్దిచెప్పకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. నిత్యం గోవిందనామ స్మరణతో మార్మోగే తిరునగరిలో చిత్తూరు రౌడీ కల్చర్ వద్దుబాబోయ్ అంటూ స్థానికులు నినదిస్తున్నారు.

రెచ్చిపోయిన రౌడీ మూకలు

ఆధ్యాత్మిక నగరంలో అలజడి

- వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులపై చిత్తూరుకు చెందిన అల్లరిమూకల దాడి
- తిరుపతిలోని గిరిపురంలో ఘటన
- ఇదెక్కడి కల్చర్ అంటూ మండిపడుతున్న నగర వాసులు



దాడిలో గాయపడి చికిత్సపొందుతున్న మనోజ్

సాక్షి, తిరుపతి : తిరుపతి నగరానికి దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక నగరం అని మంచి పేరు ఉంది. ప్రశాంతతకు మారు పేరుగా నిలుస్తోంది. నివాసయోగ్యమైన నగరంగా గుర్తింపు తెచ్చుకుంది. అలాంటి ఆధ్యాత్మిక నగరంలోకి చిత్తూరు రౌడీయిజం కల్చర్‌ని తీసుకొచ్చారు. ఇనాళ్లు ప్రశాంతంగా ఉన్న తిరుపతిలో గత కొన్ని రోజులుగా రౌడీ మూకల అరాచకాలు మితిమీరుతున్నాయి. తిరుపతిలో సమర్థవంతమైన నాయకత్వం లేదని గుర్తించిన జనసేన పార్టీ చిత్తూరు నుంచి వైఎస్సార్‌సీపీ తిరస్కరించిన ఆరణి శ్రీనివాసులను దిగుమతి చేసుకుని తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది. తిరుపతికి ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన రోజు నుంచే ఇక్కడ రౌడీమూకలు తిష్ట వేశారు. నగరంలోని పలు హోటళ్లు, హోమ్‌స్టేలు, లాడ్జీలను మే 13 తేదీ వరకు పదుల సంఖ్యలో గదులను రిజర్వ్ చేసుకున్నారు. చిత్తూరుతో పాటు తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి కరుడుగట్టిన నేరగాళ్లను తిరుపతిలో దింపినట్లు తెలుస్తోంది. వీరితో పాటు అతని వద్ద పనిచేసే వందలాది మందిని సైతం ఇక్కడ తిష్ట వేయించారు. ప్రచార ముసుగులో ఆయా ప్రాంతాల్లో పర్యటించే క్రమంలో మద్యం మత్తులో ఉన్న రౌడీ మూకలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎవరైనా నిలదీస్తే వారి వివరాలు సేకరించి దాడులకు దతెగబడుతున్నారు. అల్లరి మూకల కదలికలపై దృష్టి సారించాల్సిన పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

వరుసగా దాడులు

జనసేన పార్టీ అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు ప్రకటించి తిరుపతికి దిగుమతి అయిన రోజు నుంచి తిరుపతిలో అల్లరిమూకల తాకిడి ఎక్కువైయింది. మద్యం మత్తులో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, వైఎస్సార్‌సీపీ నాయకులపైకి దాడులకు దిగడం.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటివి ఇక్కడ సర్వసాధారణమైపోయాయి. ఈ క్రమంలో ఇటీవల ఓ వైఎస్సార్‌సీపీ యువనాయకుడిపై టీడీపీ మూకలతో కలిసి చిత్తూరు రౌడీలు దాడికి తెగబడ్డారు. ప్రస్తుతం ఆ యువకుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే నాలుగు రోజుల క్రితం డబ్బులు పంచుతున్నట్లు సమాచారం రావడంతో సాక్షి ఫొటోగ్రాఫర్, సాక్షి టీవీ రిపోర్టర్ ఖాదీకాలనీకి వెళ్లారు. ఫొటోలు తీసే క్రమంలో చిత్తూరు రౌడీలు వారిపై దాడికి దిగారు. కెమెరా, మొబైల్ లాక్కుని బీభత్సం సృష్టించారు. స్థానికులు కలగజేసుకుని ఈ దౌర్జన్యమేంటని నిలదీశారు. జీవకోనకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడిని జనసేనలోకి రావాలని తీవ్ర ప్రలోభాలకు గురిచేశారు. ఆ వ్యక్తి ససేమిర అనడంతో నీ అంతు చూస్తామంటూ చిత్తూరు రౌడీమూకలు హెచ్చరించారు. దీంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. రాబోయే రోజుల్లో చిత్తూరు రౌడీలు ఇంకెన్ని దాడులకు పాల్పడుతారోనన్న చర్చ జరుగుతోంది.



దాడులకు తెగబడుతున్న చిత్తూరుకు చెందిన అల్లరిమూకలు

వైఎస్సార్‌సీపీ బీసీ నేతలపై దాడి

తిరుపతి గిరిపురంలో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అదే ప్రాంతంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఇతర ప్రాంతాల వాసులు, అల్లరి మూకలతో ప్రచారానికి వచ్చారు. ఈ క్రమంలో ఇరుపార్టీల నేతలు తారసపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు ప్రచారం చేస్తుండగా ఎదురొచ్చిన చిత్తూరు రౌడీమూకలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. స్థానిక బీసీ మహిళా నాయకురాళ్లు ఒకరినొకరు సముదాయించుకుని సమన్వయం పాటించాలని సర్దిచెప్పుకున్నారు. అయితే ప్రచారంలో గుంపుగా ఉన్న బీసీ నాయకులు, మహిళలపైకి అల్లరిమూకలు దూసుకొచ్చారు. పక్కకు నెడుతూ నోటి కొచ్చినట్లు దుర్భాషలాడారు. మద్యం మత్తులో ఉన్న చిత్తూరు రౌడీలు నలుగురు మహిళలపై దౌర్జన్యానికి దిగి చెయ్యి చేసుకున్నారు. రెచ్చగొడుతూ మరింత ముందుకు దూసుకురావడంతో అక్కడ తీవ్ర అలజడి నెలకొంది. జనసేన అభ్యర్థి అక్కడే ఉన్నా తన అనుచరవర్గం, అల్లరిమూకలను అదుపు చేయపోవడం పట్ల నగర వాసులు మండిపడుతున్నారు. ఈ చిత్తూరు రౌడీయిజం కల్చర్ మాకొద్దు బాబోయ్ అంటూ నినదించారు. బీసీ నాయకులు, మహిళలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో వివాదం సద్దుమణిగింది.




ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు నాగరాజు, దశరథ్

రేపు నామినేషన్ల ఉపసంహరణ

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం చేపట్టనున్నారు. జిల్లాలో తిరుపతి పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 227 నామినేషన్లు రాగా.. అందులో 50 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తంగా 177 మాత్రమే అమోదం పొందాయి. అందులో 24 పార్లమెంట్‌కు, 153 ఏడు అసెంబ్లీ స్థానాలకు చెందిన నామినేషన్లు ఉన్నాయి. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన తర్వాత ఏయే నియోజకవర్గానికి ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉంటారో తెలనుంది.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సమస్యలుంటే కలెక్టరేట్‌లోని జేసీ కోర్టు హాల్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్‌ఘోష్‌కు ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్‌ఘోష్ రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, నేరుగా కలిసి ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. ఫిర్యాదులు ఏవైనా ఉంటే నేరుగా కలవలేని వారు సెల్ నం.07569909928 ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,909 మంది స్వామివారిని దర్శించుకోగా 32,403 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.81 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

సర్.. నేనూ కలెక్టర్‌నవుతా!

- పదిలో ప్రతిభ కనబరిచిన లక్ష్మీప్రియకు సత్కారం
- ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆశీర్వాదం



పది ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన లక్ష్మీప్రియను సత్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: 'సర్.. నేనూ కలెక్టర్ అవుతా. కష్టపడి చదువుకుని సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధిస్తా. ఆ తర్వాత పదిమందికీ సేవ చేస్తా'నంటూ పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా ఫస్ట్ వచ్చిన లక్ష్మీప్రియ తన మనసులోని భావాన్ని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో పంచుకుంది. శనివారం కలెక్టరేట్‌లో లక్ష్మీప్రియను కలెక్టర్ ఆత్మీయంగా సత్కరించారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వేణుగోపాల్, నిర్మల దంపతుల కుమార్తె లక్ష్మీప్రియ స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదివింది. ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో 600కుగాను 596 మార్కులు సాధించింది. ఈ క్రమంలో శ్రీకాళహస్తి మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బృందాదేవి విద్యార్థిని లక్ష్మీప్రియాతో కలసి స్థానిక ఎంఈఓ భువనేశ్వరితోపాటు కలెక్టరేట్‌లో డీఈవో వీ.శేఖర్‌ను కలిశారు. అనంతరం కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లగా ఆయన ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దూరవిద్య తరగతులు ప్రారంభం

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో దూర విద్య(డిస్టెన్స్ ఎడ్యుకేషన్) ఆన్‌లైన్ ద్వారా పలు కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు శనివారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు వర్సిటీలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కేంద్రం ద్వారా అందించే సంస్కృత గ్రంథాలను అభ్యసించి జ్ఞానాన్ని పొందాలని సూచించారు. వారం రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథన్ పాల్గొన్నారు.

తిరుపతిలో చిత్తూరు గూండాల అరాచకం

- ఓటు కూడా లేని 25 మంది నామినేషన్ ఎలా వేశారు?
- 2వేల మందికి స్టే హోమ్స్‌లో తిష్ట
- చిత్తూరు రాజకీయం తిరుపతిలో పనికిరాదు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన ధ్వజం



తిరుపతి 11వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం: 'తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి వేలాదిమంది చిత్తూరు గూండాలు, అరాచకశక్తులను తిష్ట వేయించి అరాచకాలు సృష్టిస్తున్నారు. తిరుపతి నగరంలో ఉన్న హోమ్ స్టే అపార్ట్‌మెంట్స్, లాడ్జీల్లో సుమారు 2 వేల మందికి పైగా చిత్తూరు అరాచకశక్తులను దింపారు' అని టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. తిరుపతి 10, 11 డివిజన్లలో కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి ఆధ్వర్యంలో ఆయన మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డితో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు నుంచి వచ్చిన గూండాలు, అరాచకశక్తులు వైఎస్సార్‌సీపీ నాయకులను భయపెట్టాలని ప్లాన్ చేస్తున్నారన్నారు. దీనిపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తిరుపతిలో ఓటు కూడా లేని 25 మంది చిత్తూరు అభ్యర్థులు నామినేషన్ వేశారంటే దాని వెనుక ఎంత కుట్ర ఉందో తెలుస్తోందన్నారు. ఎన్డీయే కూటమి తిరుపతిలో చేస్తున్న అరాచకాలను ఎన్నికల కమిషన్ గుర్తించి అణచివేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు గూండాలు, అరాచకశక్తులకు రానున్న ఎన్నికల్లో తిరుపతి నగర ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చిత్తూరు కుటిల రాజకీయాలు తిరుపతిలో పనికిరావని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, తిరుపతిలో ఎవ్వరికీ సాధ్యంకాని విధంగా చేసిన అభివృద్ధే భూమన అభినయ్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, గురవారెడ్డి, రూపేష్‌రెడ్డి, మురళి, వెంకటముని, ధనశేఖర్, జమునారాణి, విజయ పాల్గొన్నారు.

నలుగురికి ఉగాది పురస్కారాలు

- శ్రీసిటీలో ఘనంగా ప్రదాన కార్యక్రమం
- కళారంగాన్ని ప్రోత్సహిస్తున్నామన్న ఎండీ రవీంద్ర సన్నారెడ్డి



శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో పురస్కార గ్రహీతలు

శ్రీసిటీ(సత్యవేడు): ఉగాదిని పురస్కరించుకుని ఏటా శ్రీసిటీలో నిర్వహించే పురస్కారాల కార్యక్రమాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా సంగీత పురస్కారాన్ని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రసిద్ధ గాయకుడు కె.సరస్వి, సాహిత్య పురస్కారాన్ని కవి, సాహితీవేత్త బుచ్చినాయుడు కండ్రిగ ప్రభుత్వ ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి, ఆధ్యాత్మిక పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త, అన్నమయ్య మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఆధ్యాత్మిక రచనల పరిశోధకుడు గంధం బసవ శంకరరావు, పాత్రికేయ పురస్కారాన్ని తిరుపతికి చెందిన హిందూ మాజీ విలేకరి ఏ.దేవరాజన్ అందుకున్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ, మంచి నివాసయోగ్యప్రాంతంగా రూపుదిద్దుకునే క్రమంలో కళలను పోత్సహిస్తూ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్రతి నెలా నిర్వహించే కార్యక్రమాల్లో శ్రీసిటీ పరిధిలోని ఉద్యోగులు, గృహిణిలు, విద్యార్థులు, ప్రజలు చురుగ్గా పాల్గొనాలని కోరారు. తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల బృందం సాగించిన సంగీత విభావరి సభికులను విశేషంగా అలరించింది.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి



పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: ఇతర జిల్లాల్లో ఓటు ఉండి.. తిరుపతి జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును సద్వినియోగం చేసుకోవచ్చని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు పత్రాలకు సంబంధించి అధికారులతో కలెక్టర్ కసరత్తు చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఆదివారం వెలగపూడి సీఈఓ కార్యాలయం నుంచి ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌లను భద్రత నడుమ తిరుపతి జిల్లాకు తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు తమ ఓటు హక్కును మే 5, 6 తేదీల్లో బాలాజీ కాలనీ ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సచివాలయ అధికారి సుశీలాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా



సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అమ్మకాల్లో కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎక్సైజ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏమైనా ఫిర్యాదులు ఉంటే 9177119097, 9492630970 తెలియజేయాలని చెప్పారు. ఈ క్రమంలో మద్యం అక్రమ రవాణా, నిల్వలు, అమ్మకాలు జరగకుండా అధికారులు పర్యావేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని డిస్టిలరీ, ఔట్లెట్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి జానకీరామ్ మాట్లాడుతూ జిల్లాలోని తిరుపతి, ఓజిలి డిపోల నుంచి 24 వాహనాల ద్వారా మద్యం రవాణా చేస్తున్నామని, వాటికి జీపీఎస్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. డిస్టిలరీలలో సీసీటీవీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి రాజేంద్ర మాట్లాడుతూ మార్చి 16 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు 349 కేసులు బుక్ చేసి, 20 వాహనాలు సీజ్ చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.29.86 లక్షలుగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టోర్నమెంట్‌కు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో వర్సిటీ అధికారులు, కోచ్‌లు

తిరుపతి సిటీ : వచ్చే నెల 2వ తేదీ నుంచి కేరళ రాష్ట్రం కొట్టాయం మహాత్మాగాంధీ వర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ హ్యాండ్ బాల్ జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని పలు డిగ్రీ కళాశాలల నుంచి విచ్చేసిన క్రీడాకారులతో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబరిచిన 14మందిని సౌత్‌జోన్ టోర్నమెంట్‌కు ఎంపిక చేశామన్నారు. అనంతరం ఒంగోలు ఆంధ్రకేసరి వర్సిటీ చీఫ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీప్రసాద్ చేతుల మీదుగా క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కోచ్ పి.షణ్ముగం, క్రీడాకారులు పాల్గొన్నారు

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరులో ఉపాధి కూలీ ఎండ తీవ్రతను తట్టుకోలేక అస్వస్థతకు గురై మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఉపాధి హామీ అధికారుల కథనం.. సంతవేలూరుకు చెందిన టీ. చెంగయ్య (61) ఈ నెల 22న ఉపాధి పనులకు వెళ్లాడు. అక్కడ పనులు చేస్తూ వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. ఆపై శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

బాలకృష్ణ బహిరంగ సభకు జనం కరువు



బాలకృష్ణ మాట్లాడుతుండగానే వెనుదిరిగిన జనం

చిల్లకూరు: టీడీపీ భారీ అంచనాలతో నిర్వహించి తలపెట్టిన సినీ నటుడు బాలకృష్ణ బహిరంగ సభ జనం లేక వెలవెలబోయింది. గూడూరు పట్టణ నడిబొడ్డున టవర్ క్లాక్ సెంటర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన సభ సుమారు నాలుగు గంటలు ఆలస్యం కావడంతో చుట్టు పక్కల నుంచి వచ్చిన జనాలు పలచబడి పోయారు. ప్రచార వాహనంపైకి వచ్చిన బాలకృష్ణ సుమారు 45 నిమషాల పాటు చేసిన ప్రసంగంలో తన తండ్రి ఎన్టీఆర్ చేసిన పాత్రలు, రాజకీయ ప్రవేశం, కేంద్ర రాజకీయాలు, తెలుగుదనం, ప్రాచీన కాలం నాటి శాతకర్ణి లాంటి మాటలతో ప్రజలు విసుగు చెందారు. దీంతో ఆయన మాటలు అర్థంగాక సభకు వచ్చిన జనం నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నారు.

న్యాయం చేయాలని ఎస్పీకి మహిళ ఫిర్యాదు

ఏర్పేడు: తన భర్త మరో మహిళను వివాహం చేసుకున్నాడని, తనకు న్యాయం చేయాలని మండలంలోని బండివానిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య లక్ష్మీనారాయణమ్మ శనివారం తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్‌కు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు.. బండివానిపల్లికి చెందిన వెంకటరమణ, తిరుపతి కొర్లగుంటకు చెందిన లక్ష్మీనారాయణమ్మకు 2011 ప్రేమ మొదలైంది. 2022లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంతకాలం వారి కాపురం సుఖంగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం లక్ష్మీనారాయణమ్మను వేధించడం, మరో మహిళను వివాహం చేసుకుంటానని భర్త బెదిరించేవాడు. ఈ క్రమంలో ఇటీవల స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఈ విషయమై ఈనెల 15న ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. రెండు రోజుల కిందట భర్త వెంకటరమణ మరో మహిళను వివాహం చేసుకున్నాడని, తనకు న్యాయం చేయాలని శనివారం తిరుపతి ఎస్పీ, రేణిగుంట డీఎస్పీకి బాధితురాలు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.